క్లుప్తంగా

ముకుందపురంలో సీతారాముల తీర్థం

మాడుగుల రూరల్ : ముకుందపురం గ్రామంలో శ్రీ సీతారాములు వారి తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు బైక్ స్లో పోటీలు, పాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్లీడర్ గుమస్తాల సంఘం నూతన కార్యవర్గం



న్యాయవాదుల గుమస్తా సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

నర్సీపట్నం : న్యాయవాదుల గుమస్తాల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు బి.బాపిరాజు, కార్యదర్శి ఆర్.తిరుపతయ్య, ఉపాధ్యక్షుడు జి.తాతాలు, సంయుక్త కార్యదర్శి కె.నూకరాజు, కోశాధికారి వి.రాజుబాబు, ఆర్గనైజర్ పి.లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడు ఎం.హనుమంతురావు, కొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు. న్యాయవాది గుమాస్తా మరణాంతరం రూ.4 లక్షలు, అనారోగ్యం బారిన పడిన వారికి రూ.80 వేలు, పదవీ విరమణ చేసిన వారికి రూ.5 వేలు పెంచడంతో పాటు రాష్ట్ర న్యాయవాదుల గుమాస్తాల సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్న బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

సారా నియంత్రణలో భాగస్వాములు కండి



సారాకు వ్యతిరేకంగా ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

కె.కోటపాడు :సారాను సేవించడం వల్ల తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారి తీస్తుందని చోడవరం ఎక్సైజ్ సీ.ఐ కె.వి.పాపునాయుడు అన్నారు. మండలంలో కొరువాడ, గవరపాలెం, కొత్తభూమి, పిండ్రంగి గ్రామాల్లో శనివారం నవోదయం-2.వో కార్యక్రమంలో భాగంగా నాటుసారాతో అనర్థాలతో పాటు తయారు చేసి పట్టుబడితే విధించే శిక్షల గురించి వివరించారు. గ్రామాల్లో సారా తయారీని అరికట్టడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని చోడవరం ఎక్సైజ్ ఎస్ఐ శేఖరం అన్నారు. సారా తయారీకి వ్యతిరేకంగా సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, ప్రజలతో వీరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సబ్బవరం ఎక్సైజ్ ఎస్ఐ వి.వి.రమణ, పిండ్రంగి సర్పంచ్ జాగరపు వెంకట రామలక్ష్మి, ఎంపీటీసీలు చీపురపల్లి అచ్చిబాబు, నెక్కల గోపి పాల్గొన్నారు.


టీకాలతో వ్యాధి నిరోధక శక్తి పెంపు



ఎ.కోడూరులో నిర్వహించిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న త్రినాథ్.

కె.కోటపాడు : 0-5 ఏళ్లలోపు చిన్నారులకు వేసే వ్యాక్సిన్ల ద్వారా వారిలో వ్యాధి నిరోధకశక్తి మెరుగుపడుతుందని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెచ్.ఏ.పి.త్రినాథ్ అన్నారు. ఎ.కోడూరులో శనివారం చిన్నారులకు, గర్భిణులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పెంటావాలెంట్, పీసీవీ, పోలియో టీకాలు వేశారు. ఐదుగురు గర్భిణులకు ధనుర్వాతం, డిప్తీరియా నివారణ టీకాలు వేశారు. చిన్నారుల తల్లిదండ్రులు తప్పకుండా పిల్లలకు నిర్ణీత వయస్సుకు అవసరమైన టీకాలు వేయించాలని త్రినాథ్ సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గాలి లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల రక్షణ చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ కోటేశ్వర్రావు

రోలుగుంట : మహిళల రక్షణ వారోత్సవాల సందర్భంగా ఎస్ఐ రామకృష్ణారావు శనివారం విద్యార్థినులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇక్కడ పాల్గొన్న కొత్తకోట సీఐ మహిళల రక్షణ కోసం పోలీసు చట్టాలు ఎలా ఉపయోగపడుతున్నాయో వివరించారు. ర్యాగింగ్, లైంగిక వేధింపులకు పాల్పడే కీచకుల తాట తీస్తామన్నారు. విద్యార్థినులు ఎక్కడ ర్యాగింగ్ జరిగినా పోలీసువారి దృష్టికి తీసుకురావాలన్నారు.

ముక్కుపుటాలు అదిరేలా...!

- ఎక్కడికక్కడ నిలిచిన మురుగునీరు
- డ్రైనేజీల్లో పూడికలు తొలగించక దుర్వాసన
- అవస్థలు పడుతున్న జనం
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం



ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గేట్ కల్వర్టులో తొలగించని పూడిక



మంగీలాల్ ప్రాంతంలో నిలిచిన మురుగునీటితో చెరువును తలపిస్తున్న డ్రైనేజీ

నర్సీపట్నం : పట్టణంలో మెయిన్ రోడ్డు డ్రైనేజీల్లో పూడికతీత పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పూడికతీత పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. మురుగునీరు నిలిచిపోవటం వల్ల ఇండ్లలోని తాగునీటి బోర్లలోని వాటర్ దుర్వాసన వస్తుందని సమీపంలో నివసిస్తున్న వారు వాపోతున్నారు. సమాంతరంగా పూడిక తీయకపోవటం వల్ల మురుగు నీరు కిందికి పారడం లేదని ఆరోపిస్తున్నారు. పాత మంగీలాల్ స్వీట్‌స్టాల్ వద్ద లోతు ఎక్కువ పెట్టేసి, ఆర్టీసీ ఇన్ గేటు కల్వర్టులో పూడిక తీయకపోవడంతో మురుగనీరు పారడం లేదంటున్నారు. తమ నివాసాల్లోని తాగునీటి బోర్లలో వాటర్ దుర్వాసన వెదజల్లుతుందని, సమీపంలో నివసిస్తున్న కాళీదాసు, శంకర్ చెబుతున్నారు. తాగేందుకు నీరు పనికి రాకపోవడంతో బయట వాటర్ ప్లాంట్‌ల్లో తాగునీటిని కొని దాహార్తిని తీర్చుకుంటున్నామని బాధితులు వాపోతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పక్షం రోజులు అవుతున్నా పరిష్కారం లేదని ఆవేదన చెందుతున్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా చేస్తే తాగునీటి సమస్య తలెత్తేది కాదంటున్నారు. మురుగునీరు పారేలా చేయమని అనేకసార్లు మున్సిపల్ అధికారులకు మొర పెట్టుకున్నప్పటికీ ప్రయోజనం లేదంటున్నారు. మా గోడును పరిగణనలోకి తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలని బాధితులు మున్సిపల్ అధికారులను వేడుకుంటున్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

- తొలిరోజు ప్రశాంతం
- మాస్ కాపీయింగ్ జరగకుండా పటిష్ట నిఘా
- ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల తనిఖీ



దేవరాపల్లి : పరీక్ష అనంతరం విక్టరీ సింబల్ చూపిస్తున్న తెనుగుపూడి గురుకుల విద్యార్థులు



దేవరాపల్లి : సహాయకుడితో పరీక్షకు హాజరైన దివ్యాంగ విద్యార్థి శంకర్



మాకవరపాలెంలో పరీక్ష కేంద్రం లోపలకు వస్తున్న ఇంటర్ విద్యార్థులు

నర్సీపట్నం : ఇంటర్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. నర్సీపట్నంలో ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలు, అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల, డాన్‌బాస్కో, ప్రగతి, ఏబీఎం కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో సుమారు 2500 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్ష సమయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్దేశించారు. ఉదయం 8 గంటలకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. పోలీసులు ప్రధాన గేటు వద్దనే విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోని అనుమతించారు. సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రాల్లోకి తీసుకువెళ్లకుండా నిర్వాహకులు స్వాధీనం చేసుకున్నారు. నోటీసు బోర్డులో పెట్టిన రోల్ నంబర్లు చూసుకునేందుకు విద్యార్థులు ఎగబడ్డారు. మాస్ కాపీయింగ్ జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. పోలీసుస్టేషన్ నుంచి ప్రశ్నాపత్రాలను తీసుకువెళ్లేందుకు డాన్ బాస్కో కళాశాల నుంచి వచ్చిన జీపు మొరాయించింది. దీంతో పోలీసు వాహనంలో ప్రశ్నాపత్రాలను తీసుకువెళ్లారు. మొదటి పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి.

దేవరాపల్లి : స్థానిక పరీక్ష కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు 9 గదుల్లో సీసీ కెమెరా నిఘాలో పకడ్బందీగా జరిగాయి. ఇక్కడ పరీక్ష కేంద్రంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు బేతపూడి కేజీబీవీ, తెనుగుపూడి గురుకుల విద్యాలయం, శారదా శ్రీ జూనియర్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. 257 మంది విద్యార్థులకు గాను 243 విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ పరీ కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.నిర్మల, డీవో కేశవరావు పర్యవేక్షణ జరిపారు. ఇంటర్ ఫస్టియర్ తెలుగు-1, హిందీ-1, సంస్కృతం-1, జీఎఫ్‌సి-1 పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగాయి. మారేపల్లికి చెందిన దివ్యాంగ విద్యార్థి ఇంజరపు శంకర్ సహాయకుడితో హాజరై పరీక్ష రాశారు.

మాకవరపాలెం : మొదటి రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా, తామరం ఇమ్మానుయేలు కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారంఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. 238 మంది విద్యార్థులకుగాను 228 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని కేంద్రం చీఫ్ సుందరరావు తెలిపారు.

రోలుగుంట : స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షలో 207 మంది విద్యార్థులకు గాను 202 మంది హాజరయ్యారు. ఇక్కడ స్థానిక జూనియర్ కళాశాలలో కొంతమందితో పాటు మరువాడ మోడల్ స్కూల్, కేజీబీవీ గర్నికం, కొత్తకోట జూనియర్ కళాశాల విద్యార్థులు ఇక్కడకు వచ్చి పరీక్ష రాశారు. జిల్లా స్క్వాడ్ వచ్చి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఎంపీడీవో నాగేశ్వరావు, తహసీల్దార్ నాగమ్మ పర్యవేక్షించారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా అప్పలరాజు, డీవోగా శ్రీనివాసరావు వ్యవహరించారు.

మాడుగుల రూరల్ : తొలి రోజు ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షకు శనివారం 500 మంది విద్యార్థులకు 469 మంది హాజరైనట్టు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.నీలిమ తెలిపారు. పరీక్షలు రాస్తున్న ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీనికి తోడు కళాశాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉందని ఆమె తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈ నెల 3 తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం అవుతాయని తెలిపారు.

చోడవరం రూరల్ : ఇంటర్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చోడవరంలో మూడు పరీక్ష కేంద్రాలుండగా 1374 మంది పరీక్ష రాయాల్సి ఉంది. తొలి పరీక్షకు 54 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. తొలి రోజు సెకెండ్ లాంగ్వేజ్ తెలుగు పరీక్షతో పాటు ఒకేషనల్ విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై పరీక్ష నిర్వహించారు. శ్రీవిజ్ఞాన్ కళాశాల పరీక్ష కేంద్రానికి 371 మందికి 12 మంది విద్యార్థులు, ఉషోదయ కళాశాల పరీక్ష కేంద్రంలో 475 మందికి 17 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 528 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 28 మంది హాజరు కాలేదని ప్రిన్సిపాల్ ఉమారాణి తెలిపారు. చోడవరం సీఐ అప్పలరాజు, ఎస్ఐలు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఫార్మర్ రిజిస్ట్రీ వేగవంతం చేయాలి



చౌడు భూములను పరిశీలించి సూచనలను చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

కె.కోటపాడు : జిప్సంను దమ్ముల సమయంలో వేసి కలియ దున్నడం వల్ల చౌడు సమస్యను రైతులు అధిగమించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు అన్నారు. మండలంలో కె.సంతపాలెం, గొండుపాలెం, కె.కోటపాడు గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. గొండుపాలెం గ్రామంలో గల చౌడు భూమలను ఆయన పరిశీలించారు. ఈ చౌడు భూములకు మట్టి పరీక్షలను నిర్వహించాలని వ్యవసాయశాఖ సిబ్బందికి ఆయన సూచించారు. అనంతరం కె.సంతపాలెం, కె.కోటపాడు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఫార్మర్ రిజిస్ట్రీ నిర్వహణలో సాంకేతిక పరమైన సమస్యలు తలెత్తిన సందర్భాల్లో ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. కె.కోటపాడు మండలంలో 9300 మంది రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ చేసినట్టు తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, ఏఈవో లైలాదేవి, వ్యవసాయశాఖ సహాయకుడు సుధీర్ పాల్గొన్నారు.

సారా తయారీ చట్టరీత్యా నేరం



గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ కిరణ్‌కుమార్

నర్సీపట్నం : సారా తయారీ, విక్రయించడం చట్టరీత్యా నేరమని ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్ సూచించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా రోలుగుంట మండలం, కొంతలం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సారా రహిత గ్రామాలుగా తీర్చే లక్ష్యంతో ప్రభుత్వం నవోదయంకు శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం ఎస్ఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సారా బాధిత గ్రామాల్లో ముందుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. తయారీదారుల్లో పరివర్తన రాకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. సారా నిర్మూలనకు ప్రజల సంపూర్ణ సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ, గోవర్దన్ పాల్గొన్నారు.

రోలుగుంట : నర్సీపట్నం ఎక్సైజు శాఖ ఆధ్వర్యంలో కొంతలం గ్రామంలో శనివారం సారా నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ శాఖ ఎస్ఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా, అమ్మినా నేరమేనన్నారు. చట్టాలు కూడా చాలా కఠినంగా ఉన్నాయని తెలిపారు. సారా తాగడం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకాల నియంత్రణకు యువత సహకరించాలన్నారు. సిబ్బంది నారాయణ, గోవింద పాల్గొన్నారు.

సామరస్యతతో సమస్యల పరిష్కారం



ఇరువర్గాలకు కౌన్సెలింగ్ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగశిరీష

నాతవరం : సామరస్యంగా పరిష్కారమయ్యే సమస్యలను సైతం పంతాలు పట్టింపులకు పోతే సమస్య మరింత జటిలం అవుతుందని మండల ప్రత్యేకాధికారి నాగశిరీష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పీజీఆర్ఎస్ దరఖాస్తుదారులతో సమావేశమయ్యారు. మండల వ్యాప్తంగా అధికంగా భూవివాదాలు, ఇంటి స్థలాల సమస్యలు అధికంగా ఉన్నాయన్నారు. ఆయా వివాదాలపై అధికారులు కౌన్సెలింగ్ చేశారు. కలెక్టరు ఆదేశాల ప్రకారం రికార్డుల ఆధారంగా లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి కోర్టులను ఆశ్రయిస్తే ఆర్థికంగా ఇబ్బందులు పడతారన్నారు. గ్రామపెద్దల సమక్షంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇరువర్గాలకు న్యాయం చేయడానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

మాకవరపాలెం : ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ అశ్వనీకుమార్ శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని మహిళా మార్ట్ వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుద్యోగ యువతను మోసగించిన ప్రభుత్వం



కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ బొంతు రమణ

నర్సీపట్నం : నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం మోసగించిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ చైర్మన్ బొంతు రమణ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ఇంటికొక ఉద్యోగం అని చెప్పి 2019 వరకు ఒక్క ఉద్యోగం కూడా లేదన్నారు. 2024 ఎన్నికల్లో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పది నెలలు అవుతున్నా ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని విమర్శించారు. ఉద్యోగం ఇవ్వకపోతే నిరుద్యోగ యువతకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయింపు చేయలేదన్నారు. హామీల అమలుకు రానున్న రోజుల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం : రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో శనివారం ప్రారంభమైంది. ఈ పోటీలను ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో 24 టీమ్‌లు ఈ టోర్నమెంటులో పోటీ పడుతున్నాయి.

టెన్త్ స్టడీ మెటీరియల్ పంపిణీ



రావికమతం హైస్కూల్లో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

రావికమతం : మండలంలో 686 మంది పదో తరగతి విద్యార్థులకు సాక్షి మీడియా ప్రచురించిన స్టడీ మెటీరియల్‌ను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. రావికమతం జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి లెక్కలు, భౌతికశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను స్థానిక ఎంపీపీ పైలా రాజు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కంచిపాటి జగ్గారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుడ్డిప సర్పంచ్ గుమ్మాల గణేశ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోశిరెడ్డి ప్రసాదు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలో టి. అర్జాపురం, మేడివాడ, దొందపూడి, కొత్తకోట, కొత్తపట్నం హైస్కూలుతో పాటు మరపాక మోడల్ స్కూల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

ఉత్తమ సేవలకు ఎల్లప్పుడూ గుర్తింపు



ఎంపీపీ పాఠశాల వద్ద హెచ్ఎం కామేశ్వరిని సన్మానిస్తున్న సర్పంచ్, తదితరులు

మాడుగుల రూరల్ : ఉత్తమ సేవలు అందించే ఉద్యోగులకు సమాజంలో గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందని ఎంఈవో బి.దేముడమ్మ అన్నారు. కె.జె.పురం ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన ఏఎల్ కామేశ్వరికి పాఠశాల ఆవరణలో శనివారం వీడ్కోలు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు మాడుగుల గెడ్డబడి పాఠశాల హెచ్ఎం సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. గత 26 సంవత్సరాలుగా వేర్వేరు పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పనిచేసి, ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయురాలు కామేశ్వరి సేవలు ప్రశంసనీయమని సర్పంచ్ జామి రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము పేర్కొన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ పద్మావతి, ఉపాధ్యాయ సంఘ నాయకులు రామకొండల రావు, పొలిమేర చంద్రరావు, ఆనంద్, కె.బంగారయ్య, హైస్కూలు హెచ్ఎం వి.దాసుతో పాటు విశ్రాంత ఉపాధ్యాయులు కె.కొండలరావు, దత్తు, ప్రకాశరావు, కాళ్ల అమ్మతల్లినాయుడు, హైస్కూలు కమిటీ చైర్మన్ కర్రి సంతోష్, వార్డు సభ్యులు ఆదారి వెంకట సూరిప్పారావు ప్రసగిస్తూ కామేశ్వరి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయ సంఘాలు, స్కూలు కమిటీ, గ్రామ పంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. తనకు జరిగిన సన్మానానికి కామేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా బాలరాముని ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవం



సనాతన ధర్మం గురించి వివరిస్తున్న స్వామిజీ



పుర వీధుల్లో చైతన్య పాదయాత్ర చేస్తున్న భక్తులు

నాతవరం : బాలరాముని ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో శనివారం చైతన్య పాదయాత్ర నిర్వహించారు. భారతీయ ధర్మ పరిషత్ జాతీయ అధ్యక్షుడు డాక్టరు కృష్ణ చరణానంద భారతీ స్వామి ఆధ్వర్యంలో నాతవరం ప్రధాన కూడలి పురవీధుల్లో యాత్ర నిర్వహించారు ఈ సందర్భంగా కృష్ణ చరణానంద భారతీస్వామి మాట్లాడుతూ సనాతన హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్నారు. గోవధను సంపూర్ణంగా నిషేధించి గోసంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. భారతీ హిందూ సంస్కృతి, పురాణ, ఇతిహాస కావ్య గ్రంథాలను విద్యార్థుల పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. విశ్వ వ్యాప్తంగా హిందువులకు రక్షణ కల్పించాలన్నారు. అనంతరం సనాతన ధర్మసభ సామూహిక విశ్వ కళ్యాణ యజ్ఞ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నాతవరం ప్రధాన కూడలిలో గల అటవీశాఖ స్థలంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలో గల ప్రతి పంచాయతీ నుంచి అధిక సంఖ్యలో భజన భక్తులు విచ్చేసి మహిళలు భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాతవరం శ్రీ బాల వినాయక ఆలయ కమిటీ చైర్మన్ యర్రా కాశీ విశ్వేశ్వరావు, బీజేపీ జిల్లా నాయకులు కాళ్ల సుబ్బారావు, గవిరెడ్డి త్రినాథ్ భజన భక్తులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల హక్కులపై అవగాహన అవసరం



కె.కోటపాడు హైస్కూల్‌లో కిశోర బాలికలతో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న పీవో మంగతాయారు

కె.కోటపాడు : మహిళలు, బాలికల హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవడం ద్వారా మోసపోయే పరిస్థితులను అధిగమించవచ్చునని కె.కోటపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి మంగతాయారు అన్నారు. మార్చి 1 నుండి 8 వరకూ నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా శనివారం కె.కోటపాడు హైస్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులతో కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా మంగతాయారు మాట్లాడుతూ బాలికలకు నిర్ణయించిన వయస్సు వచ్చేంత వరకూ వివాహాలు చేయరాదని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. అనంతరం కిశోర బాలికలతో కలిసి సైకిల్ ర్యాలీతో పాటు హైస్కూల్ ఆవరణలో మొక్కలను నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కె.కోటపాడు హైస్కూల్ హెచ్ఎం పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో కాంతమ్మ, వేదికపై ఎంపీడీవో సువర్ణరాజు, ఏపీఎం ప్రభాకర్

దేవరాపల్లి : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయడం ద్వారా ఆరోగ్యకర పంటలు దిగుబడి పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతపై వెలుగు, వ్యవసాయ సిబ్బందికి అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సువర్ణరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు అవగాహన కల్పించి, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకాన్ని తగ్గించేలా చైతన్యం తీసుకురావాలని సూచించారు. వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్ పాల్గొన్నారు.

మాడుగుల : మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని నూరుశాతం ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించి, ప్రకృతి వ్యవసాయం చేయాలని స్థానిక మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు పేర్కొన్నారు. వెలుగు కార్యాలయంలో శనివారం వెలుగు సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు.

క్విజ్ విజేతలకు బహుమతులు

చోడవరం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త క్విజ్ పోటీల్లో విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ ప్రకటించారు. సైన్సుడే సందర్భంగా శుక్రవారం ఆన్‌లైన్ విధానంలో ఈ పోటీలను నిర్వహించగా 267 మంది విద్యార్థులు పలు కళాశాలల నుంచి పాల్గొన్నారని శనివారం ఓ ప్రకనలో తెలిపారు. క్విజ్ పోటీ నిర్వహణ కమిటీ ఏడుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం విజేతలకు నగదు బహుమతులను సమకూర్చారని తెలిపారు. ఈ సందర్భంగా వారికి ప్రిన్సిపాల్, ఇతర ఉపన్యాసక బృందం అభినందనలు తెలిపింది.

పోలీసు జాగిలాలతో విస్తృత తనిఖీలు



సీఐ రేవతమ్మ సమక్షంలో డాగ్ స్క్వాడ్‌తో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసు సిబ్బంది

నర్సీపట్నం: పోలీసు జాగిలాలతో రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, సిబ్బందితో కలిసి నర్సీపట్నం మండలం, గబ్బాడ వద్ద చింతపల్లి రోడ్డులో శనివారం రాత్రి విస్తృతంగా తనిఖీ చేపట్టారు. చింతపల్లి నుంచి వచ్చే వాహనాలను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. బ్యాగ్‌లు, గోనె సంచి బస్తాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్‌తో మాదక ద్రవ్యాల నియంత్రణకు ఎప్పటికప్పుడు తనిఖీ చేపడుతున్నామన్నారు. గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు ముమ్మరం చేశామన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్‌ల పంపిణీ

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్న సందర్భంగా శనివారం పరీక్ష కిట్‌లను అందచేశారు. హైదరాబాద్‌కు చెందిన క్షత్రియ యూత్ వింగ్ విద్యార్థులకు సమకూర్చిన పరీక్ష కిట్‌లను శాసనసభ్యులు కె.ఎస్.ఎన్.ఎస్.రాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయుడు పాండురంగారావు, సభ్యులు పృథ్వీరాజ్, శ్రవణ్‌వర్మ, అభివర్మ, కిరణ్‌వర్మ, శ్రీవర్మ పాల్గొన్నారు.